క్లుప్తంగా

చర్చిలో కె.కె.రాజు ప్రార్థనలు



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న కె.కె.రాజు, పార్టీ శ్రేణులు

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు రాజీవ్‌నగర్‌లోని దైవస్వరూపి చర్చిను ఆదివారం వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్ ప్రభుదాస్ కె.కె.రాజుకు ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ట్రెకింగ్ శిబిరానికి ఎన్‌సీసీ క్యాడెట్ల పయనం



ఎంపికైన విద్యార్థులతో ఎన్‌సీసీ అధికారులు

సీతంపేట: తమిళనాడు రాష్ట్రం ఊటీలో జరిగే ఆల్ ఇండియా ట్రెకింగ్ శిబిరానికి అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు మంగపూడి శృతి, జరజాపు శ్రావణి ఎంపికయ్యారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 520 మంది క్యాంప్‌లో పాల్గొంటున్నారని, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 31 మంది క్యాడెట్లు వెళ్తున్నారని పాఠశాల ఎన్‌సీసీ అధికారి ఎం.ఎస్.వి.విశ్వనాథం, సుబేదార్ జయప్రకాష్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఆదివారం ఉదయం రైలులో ఊటీకి పయనమయ్యారు. ఎన్‌సీసీ యూనిట్ అధికారి కల్నల్ అజయ్‌కుమార్, హెచ్‌ఎం లక్ష్మీనరస ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

అలరించిన 'వినోదాల విందు'



స్కిట్ ప్రదర్శిస్తున్న ప్రకాష్, సుబ్రహ్మణ్యం

సీతంపేట: ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా ఫ్రెండ్స్ కామెడీ క్లబ్, హైదరాబాద్ హ్యూమర్ క్లబ్ సంయుక్తంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన వినోదాల విందు కార్యక్రమం ఆద్యంతం అలరించింది. సంస్థ వ్యవస్థాపకులు, కళాకారులు ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, జె.ఎల్.నరసింహం, కె.ఎల్.కామేశ్వరరావు, డేవిడ్ రాజు, కుమారి, రావి గోపి, భాను ప్రకాష్, శివజ్యోతి, ఇమంది ఈశ్వరరావు, దుర్గాప్రసాద్, భాస్కరాచారి ప్రదర్శించిన కామెడీ స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. వీటిలో ఆక్సిడెంట్ రక్షించి, డాక్టర్ పేషెంట్, విడాకులు, మ్యారేజ్ బ్యూరో, పార్టీ, ఇంటర్వ్యూ స్కిట్స్ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. అనంతరం పలువురు కళాకారులను, వివిధ రంగాలలో సేవలందించిన పలువురిని సత్కరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

మర్రిపాలెం: గుర్తు తెలియని ఓ వ్యక్తి ఈ నెల 2న మృతిచెందడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించిన ఘటన ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ధర్మానగర్ ఆశీర్వాద్ కల్యాణ మండపం రైల్వే క్వార్టర్స్ వద్ద సుమారు 45 ఏళ్ల వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. అతడి ఫ్యాంట్ జేబులో అస్సాంకు చెందిన ఐడీ కార్డు ఉంది. దీంతో రేడియో మెసేజ్ ద్వారా వారికి సమాచారం అందించారు. ప్రస్తుతం అతడి మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ బి.నరసింహమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చక్కనైన మెట్ల మార్గాలు


డెవలప్‌మెంట్ వాచ్



48వ వార్డు కొండవాలు ప్రాంతం ఇందిరానగర్‌లో నిర్మించిన మెట్ల మార్గం



47వ వార్డు అరుంధతినగర్‌లో రహదారికి అనుసంధానంగా నిర్మించిన రైయిలింగ్‌తో కూడిన మెట్ల మార్గం



48వ వార్డు జైభారత్‌నగర్‌లో నిర్మించిన మెట్ల మార్గం



46వ వార్డు కస్తూరినగర్ కొండవాలు ప్రాంతంలో నూతన మెట్ల మార్గం

వైఎస్ జగన్ ప్రభుత్వంలో నియోజకవర్గంలోని కొండవాలు ప్రాంతాలకు మహర్దశ పట్టింది. ముఖ్యంగా కొండవాలు నివాసుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా శిథిలమైన వాటి స్థానంలో కొత్తగా నాణ్యమైన చక్కని మెట్ల మార్గాలు నిర్మించారు. 46, 47, 48, 49 వార్డుల్లోని కొండవాలు ప్రాంతాల్లో రూ.32.85 కోట్లతో మెట్ల మార్గాలు, డ్రైనేజీలు, రెయిలింగ్ వంటి అభివృద్ధి పనులు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు కృషితో కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరిగాయి.

– కంచరపాలెం

కె.కె.రాజుకే మా మద్దతు



తాటిచెట్లపాలెం గ్రామ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు



కంచరపాలెం మార్కెట్ వర్తక సంఘం సభ్యులతో మాట్లాడుతున్న కె.కె.రాజు

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ దేవరకొండ మార్కండేయులు ఆధ్వర్యంలో ఆదివారం కంచరపాలెం కూడలిలోని మార్కెట్ యార్డ్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు కంచరపాలెం మార్కెట్ వర్తక సంక్షేమ సంఘం సభ్యులు, వర్తకులు తమ మద్దతు తెలిపారు. కె.కె.రాజు మాట్లాడుతూ పదేళ్లుగా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తనను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వారిని కోరారు. కార్యక్రమంలో ఎస్.సుబ్రహ్మణ్యం, జి.ఈశ్వరరావు, సూరడ నూకరత్నం, సీరపు లత, ధనలక్ష్మి, రవి, యశోద తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సంఘాల సంపూర్ణ మద్దతు

తాటిచెట్లపాలెం: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ పరిసర ప్రాంతాలకు చెందిన 4 గ్రామ సంఘాల పెద్దలు తెలిపారు. స్థానిక ప్రైవేట్ గెస్ట్ హౌస్‌లో పార్టీ నాయకుడు నూనెల పోలారావు ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ సంఘాల పెద్దలతో కె.కె.రాజు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఇంతవరకు వేరే పార్టీలో ఉన్నప్పటికీ ఏ నాయకుడు చేయని విధంగా నియోజకవర్గాన్ని కె.కె.రాజు అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఆయన చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు, సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో చేసిన అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రతి వర్గానికి మేలు చేసేలా పరిపాలిస్తున్నారని, మీరంతా మరెంతో మందికి వీటిని తెలియజేసి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, నాయకులు ఆళ్ల శ్రీనివాస్, పి.ఎల్.ఎన్.పట్నాయక్, గొంప గోవిందరాజు, దాడి శ్రీను, పరదేశమ్మ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నిరంతరం శ్రమిస్తున్న కె.కె.రాజును గెలిపిద్దాం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: ప్రజా సమస్యల పరిష్కారం, ఉత్తర నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును గెలిపించుకుందామని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పిలుపునిచ్చారు. 46, 47 వార్డుల కంచరపాలెం, కైలాసపురం కొండవాలు ప్రాంతాల్లోని సంజీవయ్య కాలనీ, తిక్కవానిపాలెం కాలనీ, కస్తూరినగర్, శాంతినగర్‌ల్లో మౌంటెయిన్ వ్యూ అసోసియేషన్, సంపత్ వినాయక సంక్షేమ సేవా సంఘాల సభ్యులతో ఆదివారం ఆయన ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కె.కె.రాజు మద్దతు పలకాలని ఆయా సంఘాల సభ్యులను కోరారు. ఆయన విజయానికి పార్టీలకు అతీతంగా సహకరించాలని సూచించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి కె.కె.రాజును అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో గనగల శంకర్, రామరాజు, కనకరాజు, సురేష్, నవీన్, నాగరాజు, కోల చంటి, ఎస్.తాతారావు, కోలా శ్రీను, లుట్బా శివ, జి.అప్పారావు, బొడ్డి భాస్కరరావు, కోలా రమేష్, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంగనాథ్‌కు సత్కారం



రంగనాథ్‌ను సత్కరిస్తున్న సింహాద్రి రాజు

సీతంపేట: సీతమ్మధార ఏపీ ఎస్సీబీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ సంయుక్తంగా ఆదివారం న్యాయ పరిశోధనలో అంతర్జాతీయ డాక్టరేట్ పొందిన రంగనాథ్‌ను ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథి ఏపీఈపీడీసీఎల్ మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.సింహాద్రి రాజు మాట్లాడుతూ ప్రతిభావంతులకు ఏ ప్రాంతంలోనైనా గుర్తింపు, గౌరవం లభిస్తాయన్నారు. న్యాయ విద్య, గీతాలాపనలో పేరుపొందిన రంగనాథ్‌కు అమెరికాలోని విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడమే ఒక ఉదాహరణ అన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఎస్.ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ రంగనాథ్ బహుముఖ ప్రజ్ఞాశాలని కొనియాడారు. సత్కార గ్రహీత రంగనాథ్ మాట్లాడుతూ ఏడుపదులు నిండినా నిరంతరం సాధన చేయాలని తపనే ఈ స్థాయికి తనను చేర్పిందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.రామారావు, స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ కొరియోగ్రాఫర్ ఆర్.నాగరాజు పట్నాయక్, డైరెక్టర్ కల్పన సంఘవి పాల్గొన్నారు.

సేవా ప్రాజెక్టులకు నిధుల మంజూరు

దాబాగార్డెన్స్: రోటరీ ఇంటర్నేషనల్ మానవతా సేవా ప్రాజెక్టుల అమలుకు నిధులు మంజూరు చేస్తోందని, ప్రపంచంలోని పర్యావరణ అసమతుల్యతను తగ్గించడానికి పర్యావరణ ప్రాజెక్టులు కూడా చేపట్టిందని క్లబ్ జిల్లా గవర్నర్ ఎలెక్ట్ చెప్పారు. నగరంలోని ఓ హోటల్లో ఆదివారం రోటరీ జిల్లా సహాయ నిధి సదస్సు నిర్వహించారు. డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇచ్ఛాపురం నుంచి అమరావతి వరకు గల 82 రోటరీ క్లబ్‌ల ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారన్నారు. రానున్న కాలంలో మరిన్ని మానవతా సేవా కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన ప్రాజెక్టులు గుర్తించాలని పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ సామ్ ముప్ప సూచించారు. ఆర్‌వీ సుబ్బారావు మాట్లాడుతూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు రోటరీ ఇంటర్నేషనల్ నుంచి మరిన్ని నిధులు పొందేందుకు సహకరించాలన్నారు. జిల్లా, రోటరీ ఇంటర్నేషనల్ నుంచి గ్రాంట్లు పొందడానికి అనుసరించాల్సిన మార్గదర్శకాలను జి.విశ్వనాథ్ వివరించారు.

జైభారత్ పార్టీ మేనిఫెస్టో విడుదల



మేనిఫెస్టో విడుదల చేస్తున్న లక్ష్మీనారాయణ

సీతంపేట: తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఉత్తర నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరిస్తానని జైభారత్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వి.వి.లక్ష్మీనారాయణ హామీ ఇచ్చారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో 34 హామీలతో మేనిఫెస్టోను రూ.100 స్టాంప్ పేపర్‌పై సంతకం చేసి ఆయన విడుదల చేశారు. రాష్ట్రంలో జైభారత్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న 80 మంది అసెంబ్లీ, 10 మంది ఎంపీ అభ్యర్థులు వారు ప్రకటించిన హామీలను రూ.100 స్టాంప్ పేపర్‌పై విడుదల చేస్తున్నట్లు లక్ష్మీనారాయణ తెలిపారు. గెలిచాక హామీలు నెరవేర్చకపోతే నియోజకవర్గ ప్రజలు సివిల్, క్రిమినల్, పోలీస్ కేసులు పెట్టి తమను నిలదీయవచ్చన్నారు.

అందరూ బాగుండాలనే భావన ప్రధానం

- ప్రవచన కర్త గరికపాటి నరసింహారావు



గరికపాటి నరసింహారావు దంపతులను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ కార్యవర్గం

ఏయూ క్యాంపస్: 'సమాజంలో అందరూ బాగుండాలి' అనే భావనతో ప్రతి వ్యక్తి ఆకాంక్షించాలని ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అన్నారు. సీషోర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వీఎంఆర్‌డీఏ పార్కు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన లోక కల్యాణం కోసం ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. జీవితాన్ని ఒక నడకగా భావించాలన్నారు. ఎవరిపైనా ఆధారపడకుండా మన నడక మనం సాగిస్తామని, అదే విధంగా జీవితంలో ముందుకు సాగాలన్నారు. సంసారాన్ని సాగరంతో పోలుస్తారని, ఇక్కడ ఉన్నవారు సాగరాన్ని చూస్తే ఎన్నో జీవిత సత్యాలు తెలుసుకోవచ్చునన్నారు. నేను అనే భావన మన మనసుల్లో తొలగాలన్నారు. మన స్థితి, గ్రహస్థితి బాగుండాలంటే పరమేశ్వరుడిని మన హృదయంలోకి ఆహ్వానించాలని సూచించారు. అనంతరం గరికపాటి దంపతులను సీషోర్ వాకర్స్ క్లబ్ సభ్యులు సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు డి.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి జి.తిరుపతిరావు, కోశాధికారి ఎం.ఎస్.నాయుడు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి

దాబాగార్డెన్స్: మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎస్ఎన్ఎల్‌యూ ఫస్ట్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.సత్యనారాయణ పిలుపునిచ్చారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం 'హ్యూమన్ రైట్స్ డిఫెండర్స్ మీట్' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 25 ఏళ్లుగా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తాజాగా అమల్లోకి తీసుకొచ్చిన పలు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో విశాఖ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సత్కరించారు. కౌన్సిల్‌కు చెందిన వివిధ జిల్లాల సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమాభివృద్ధి



తాటిచెట్లపాలెంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

- ప్రతి ఇంటికీ మేలు చేశాం
- ఎన్నికల ప్రచారంలో 'ఉత్తర' ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పిలుపునిచ్చారు. 55వ వార్డులో కార్పొరేటర్ కె.వి.ఎన్.శశికళ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గవర తాటిచెట్లపాలెం, సాక్షి గణపతి ఆలయం వీధి, ధర్మానగర్, తిక్కవానిపాలెం ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ప్రతి ఇంటికీ జరిగిన మేలును తెలియజేస్తూ.. మేలు జరిగితేనే ఓటు వేయాలని ధైర్యంగా చెప్పిన నాయకుడు వైఎస్ జగన్ అని కె.కె.రాజు అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పార్టీ నాయకులు జి.వి.రవిరాజు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఎన్నికల పరిశీలకులు, ఆయా విభాగాల నాయకులు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి



శ్రీస్టార్ వాకర్స్ క్లబ్ సభ్యులతో కె.కె.రాజు

కంచరపాలెం: నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని చూసి తనను ఆదరించి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు కోరారు. 54వ వార్డు కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని శ్రీస్టార్ వాకర్స్ క్లబ్‌లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్క క్లబ్ సభ్యుడిని ఆయన ఆత్మీయంగా పలకరించి పరిచయం చేసుకున్నారు. ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వాకర్స్ క్లబ్ సభ్యులకు వివరించారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కె.కె.రాజు అభ్యర్థించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చల్లా రజని, పార్టీ వార్డు అధ్యక్షుడు చల్లా ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా సేవాదళ్ ప్రధాన కార్యదర్శి, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షుడు అతవ సుబ్బారావు, సీనియర్ నాయకులు కాయిత పైడి రత్నాకర్ యాదవ్, కణితి చిరంజీవి, పల్లా సోమేశ్వరరావు, శ్రీస్టార్ వాకర్స్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పద్మశాలీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తా



పద్మశాలి కులస్తుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు హామీ

సీతంపేట: పద్మశాలి కులస్తులకు రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తానని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు హామీ ఇచ్చారు. భక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శంకరమఠం రోడ్డులోని భవనంలో నిర్వహించిన ఉత్తర నియోజకవర్గ పద్మశాలి కులస్తుల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. పద్మశాలీల సామాజిక భవనం కోసం 20 సెంట్ల స్థలం కేటాయించేలా కృషి చేస్తానన్నారు. 2019కి ముందు విశాఖలో జరిగిన అభివృద్ధి.. వైఎస్ జగన్ పాలనలో జరిగిన సంక్షేమాభివృద్ధిని బేరీజు వేసుకోవాలన్నారు. ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి మోహం చాటేసినా.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఉత్తర ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడ్డానని తెలిపారు. 2014 నుంచి 2019 వరకు ఎమ్మెల్యేగా పనిచేసిన విష్ణుకుమార్ రాజు.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పటికీ ఒక్క పరిశ్రమ గాని, కోటి రూపాయల పెట్టుబడి కానీ తేలేదన్నారు. ఐదేళ్లలో రూ.435 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, సుమారు రూ.1,500 కోట్ల పెట్టుబడులు తెచ్చానని చెప్పారు. 17 ఎకరాల్లో ఇనార్బిట్ మాల్, ఐటీ టవర్, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం శరవేగంగా జరుగుతోందని, బిర్లా కూడలి వద్ద మూడెకరాల్లో ఏఎంసీ మాల్ నిర్మిస్తున్నారని, వీటి వల్ల స్థానికంగా 15 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

కుటుంబ సభ్యుడిగా ఆదరించండి

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న తనను రౌడీ రాజుగా తన ప్రత్యర్థి పేర్కొనడం హాస్యాస్పదమని కె.కె.రాజు అన్నారు. పరిపాలన రాజధానికి విశాఖ అనుకూలమని చెప్పమని చంద్రబాబును, పవన్‌ను అడ్డుకున్నానని, అది ఈ ప్రాంత అభివృద్ధికే గాని, తన సొంత ప్రయోజనాల కోసం కాదని ప్రజలు గుర్తించాలన్నారు. తమ్ముడిగా, కుటుంబ సభ్యుడిగా, బిడ్డగా మీ అందరికీ అందుబాటులో ఉంటానని, తన అధికారాన్ని ప్రజల శ్రేయస్సు కోసం నూరు శాతం వెచ్చించి అంతా గర్వపడేలా పనిచేస్తానని చెప్పారు. మరిన్ని పెట్టుబడులు, ఉపాధి అవకాశాల కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ సంపంగి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు అంబటి శైలేష్, పద్మశాలి సంఘం నాయకులు గుదే వేణు, చిక్కా సత్యనారాయణ, తెడ్లాపు వెంకటేశ్వరావు, కులపాక సన్యాసిరావు, కరణం వెంకటేశ్వరరావు, సూరిశెట్టి సూరిబాబు, వానపల్లి ఈశ్వరరావు, ఆలేటి హేమలత, కార్యవర్గ సభ్యులు, పద్మశాలి కులస్తులు పాల్గొన్నారు.

ప్రచార పర్వం



25వ వార్డు సీతంపేటలో కె.కె.రాజుకు మద్దతుగా ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ – సీతంపేట



గాజు గ్లాసుపై ఓటేసి తనను గెలిపించాలని సీతమ్మధారలో ప్రచారం చేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి వద్దీ శిరీష – సీతంపేట



వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును గెలిపించాలని కోరుతూ ఆదివారం 51వ వార్డు వుడా కాలనీ పరిసర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ – మర్రిపాలెం